ఒకమాటు నారదుడు శ్రీకృష్ణుడ్ని చూడాలని ద్వారకకు వెళ్ళాడు. కలిసాడు. కుశలప్రశ్నలు అయ్యాక నారదుడు

"కృష్ణా! నీవు పెద్ద మాయగాడ వని అందరూ చెప్పుకుంటున్నారు. అసలు 'మాయ' ఎలావుంటుందో!"

"చూపిస్తాను. అలా వెడదాం రా నాతో."

ఇద్దరూ బయలుదేరారు. ఓ ఎడారిలో కాలు పెట్టారు. "నారదా నాకు చాలా దాహం అవుతోంది. ఎక్కడైనా కాసిని నీళ్ళు దొరుకుతాయేమో చూస్తావా?" అన్నాడు కృష్ణుడు. "ఓ! అలాగే! తెస్తాను" అని బయలుదేరాడు నారదుడు. కొంతదూరం నడిచాక ఓ పల్లెటూరు వచ్చింది. అక్కడ బావి దగ్గిర ఓ సుందరి నీళ్ళు తోడుతోంది. ఆ అమ్మాయి అందానికి ముగ్ధుడైనాడు. వచ్చిన పని మర్చిపోయాడు. అతడి కళ్ళు ఆమెను దాహంగా చూసాయి. అదృష్ట వశాత్తు ఆచుట్టుపక్కల ఎవరు లేరు. ఆమెను సమీపించి

"గొంతుక ఎండి పోతోంది. కాసిననీళ్ళు బుల్లెమ్మా!" అని అడిగాడు.

"ఆ అలాగేనంది! మరి నాదగ్గిర పాత్ర ఏం లేదు ఎలాగ?"

"ఇలా పొయ్యి!" అని నారదుడు దోసిలి పట్టాడు. ఆ అమ్మాయి కడవతో నీళ్ళు పోస్తోంది. కారిపోతున్నాయి. పురుషుని హృదయం స్త్రీ ఇట్టె కనిపెట్టేస్తుంది. వెంటనే ఆమె అడిగేసింది—

"ఏమండీ! మీకు నిజంగా దప్పిక వేసిందా? లేక ఒంటరిగా ఉన్న అమ్మాయిని పలకరిద్దామని........"నారదుడు తన కలవరపాటు సర్దుకొని—

'కళ్యాణీ! నీరూపం నన్ను పరవశుడ్నిగా చేసింది. నీకు పెళ్ళికాలే దని గ్రహించాను. నీకు అభ్యంతరం లేకపోతే..............." అంటూ బయటపడ్డాడు చిరునవ్వుతో.

ఆ అమ్మాయి సిగ్గుతో తలవంచి

# ఇంద్రజాలం

"స్వామీ! తండ్రి చాటు బిడ్డని. ఇక్కడ నేను ఆలస్యంచేస్తే ఇంటిదగ్గర కోప్పడతారు" అంటూ చెప్పి కడవ భుజాన్ని పెట్టుకొని చరచర అడుగులేస్తూ ఇంటి దారి పట్టింది.

ఆమె చూపులు - మాటలు నారదునికి సుముఖంగానే తోచాయి. నీడలా వెంట పడ్డాడు.

ఆ అమ్మాయి ఇంట్లోకి వెళ్ళింది. అతను కాస్త ఆగి బట్టలు జుత్తు సర్దుకొన్నాడు. గుమ్మంలో కూర్చున్న ఆయన్ని ఆమె తండ్రిగా గ్రహించాడు. సమీపించి నమస్కరించాడు.

"రండి! కూర్చోండి!" అని ఉచిత ఆసనం చూపించి "బాబూ! మీదేవూరు? ఇలా ఎక్కడిదాకా వెడుతున్నారు? నాతో ఏమైనా పని వుందా!" అని అడిగాడు. "ఇక్కడకే వచ్చాను. మీతోపని వుంది. బ్రహ్మచారిని. తగిన సంబంధం కోసం ...................."

"అయ్యా! అర్థమైంది. మా అమ్మాయికి తల్లి లేదు. నాకు అటు వ్యవసాయానికి ఇటు ఇంట్లోకి దిక్కు అదే. మీరు ఇల్లరికానికి అంగీకరిస్తే......................"

"ఆహా! మీరేం సంకోచింప నక్కర్లేదు. నాకు వెనక ఎవ్వరూ లేరు. ఇవాల్టినుంచి ఇక్కడే ఉండి పోతాను. శీఘ్రమే మా వివాహం జరిపించండి" అన్నాడు సంబరంగా.

వాళ్ళిద్దరికి వివాహం జరిగిపోయింది. వ్యవసాయంలో మామగార్కి సహాయం వెడుతున్నాడు. సాఫీగా సంసారం సాగిపోతోంది.

నాలుగేళ్ళకు నలుగురి బిడ్డల తండ్రి అయ్యాడు నారదుడు. ఇంతలో మామగారు చనిపోయారు. ఇంట్లో భార్య ఒక్కర్తే పిల్లల్ని సముదాయించలేక పోతోంది. బయట వ్యవసాయం మొత్తం చూసుకోవాల్సి వచ్చింది. సంసారంలో సుఖం 'మీసాలపై తేనె' అని తెలిసివచ్చింది. ఏదో నాచుకాళ్ళకు చుట్టుకున్నట్లైంది. కాని తప్పుకోడానికి దారి కనబడ్డం లేదు.

ఇలా అతను సతమతమవుతుండగా పులిమీద పుట్రలా ఒక రోజున తుపాను లంకించు కుంది. ఊరు మునిగింది. ఇంట్లోకి నీళ్ళు వచ్చేసాయి.

నారదుడు ఒక నావ సంపాదించి తన కుటుంబాన్ని అందులో కూర్చుండబెట్టి తెడ్లు వేయసాగాడు. కెరటాలు విజృంభించాయి. తెడ్లు తేలిపోయాయి. పడవ తలక్రిందులైంది.

"మునిగిపోతున్నాం! బాబోయి! అమ్మా! నాన్నా!" అంటూ పిల్లల హాహాకారాలు-భార్య శోకాలు వినిపిస్తున్నాయి. ఒకరి కొకరు అందటం లేదు. అలల తాకిడిక 'ఎవరికి వారే యమునా తీరే" అన్నట్లయింది.

చివరికి నారదుడు ఒక ఒడ్డుకు నెట్టివేయబడ్డాడు. చతికిల బడ్డాడు.

నిస్పృహ, ఆయాసం ఆవరించాయి. "అయ్యో! నా భార్య-నా పిల్లలు-కృష్ణా!" అంటూ ఆక్రోశించాడు.

"ఆః నారదా! భయపడకు. నే నిక్కడే వున్నా. కలగన్నావా? భార్య ఎక్కడ? పిల్లలేమిటి?" అని కృష్ణుడు వీపు తట్టాడు.

నారదునికి చీకట్లోంచి వెలుతురులోకి వచ్చినట్లైంది సర్వేశ్వరుని స్పర్శతో.

"ప్రభో! కృష్ణా! నీవింత ఇంద్రజాలికుడవు అని అనుకోలేదు. శరణు!" అంటూ ఆయన పాదాలమీద పడ్డాడు.

-శ్రీ కావలిపాటి సూర్యప్రకాశరావు